

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర

## అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ, మే 31: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆవిర్భావ వేడుకలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేయడంతో పాటు ఆయా శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించాలని, స్టాల్స్, అత్యవసర సేవలు అందించిందుకు ఆరోగ్య, ఫైర్, ఆర్అండ్‌బీ శాఖల వారు ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శనలు చేయాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు చేయాలన్నారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని జండావిష్కరణ చేస్తారన్నారు. తొలుత క్లాక్ టవర్ సెంటర్ వద్ద అమరుల స్తూపానికి నివాలులర్పించి పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జెండా విష్కరణ చేస్తారన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ వేడుకల సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, ఆర్డీవో అశోక్ రెడ్డితోపాటు అయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఎంజీయూలో అవతరణ వేడుకలు

రామగిరి, మే 31 : జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుసేన్స్ జెండా ఆవిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. అన్ని విభాగాల అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.



అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## నార్కట్‌పల్లిలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన

- **మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూజలు**

నార్కట్‌పల్లి మే 31 : మండల కేంద్రంలో ముత్యాలమ్మ, మారెమ్మ, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ విగ్రహాలను శనివారం ఘనంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు.

## మెరుగైన సేవలు అందించాలి

- **డీఈ విద్యాసాగర్**

కొండమల్లేపల్లి, మే 31: వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించాలని డివిజన్ ఇంజినీర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం సాగర్ రోడ్డులోని విష్ణు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉద్యోగులకు నూతనంగా అందించిన బిల్లింగ్‌కు సంబంధించి డిజిటల్ యంత్రాల వినియోగంపై హైదరాబాద్‌కు చెందిన అనలాజికల్ కంపెనీ సర్వీస్ ఇంజినీర్లు సంతోశ్, మహేశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ..విద్యుత్ ఉద్యోగులు బిల్లులు సకాలంలో వసూలు చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా డిజిటల్ యంత్రాల ద్వారా ఎప్పటికప్పుడు వసూలు చేసే విధంగా చూడాలన్నారు. సకాలంలో బిల్లులు వసూలు చేస్తేనే ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వస్తాయని, లేకుంటే సంస్థ ఇబ్బందుల్లో కూరుకుపోతుందని సూచించారు. అయ్యార్, కలెక్షన్ విషయంలో సూర్యాపేట, యాదాద్రి జిల్లాల తర్వాత నల్లగొండ జిల్లా ఉందన్నారు. నల్లగొండ జిల్లా ముందు వరుసలో ఉండేవిధంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ, నాంపల్లి, ఏడీఈలు సైదులు, సాగర్‌రెడ్డి, దేవరకొండ డివిజన్‌లోని పది మండలాలకు చెందిన ఏఈలు, లైన్‌మాన్లు, బిల్లింగ్ చేసే జూనియర లైన్‌మాన్లు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 3 నుంచి రెవెన్యూ సదస్సులు

రామన్నపేట, మే 31: ఈ నెల 3 నుంచి 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ లాల్‌బహదూర్ తెలిపారు. 3న భోగారం, బాచుప్పల, 4న నిధానపల్లి, బి.తుర్కపల్లి, 5న నిధానపల్లి, జనంపల్లి, 6న దుబ్బాక, ఎన్నారం, 9న లక్ష్మాపురం, కుంకుడుపాముల, 10న సిరిపురం, ఇస్కిళ్ల, 11న శోభనాద్రిపురం, మునిపంపుల, 12న పల్లివాడ, సూరారం, 13న తుమ్మలగూడెం, ఉత్తటూరు, 16న వెల్లంకి, కక్కిరేణి, 17న రామన్నపేటలో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

చిట్యాల, మే 31 : ఈ నెల 3 నుంచి 20 వరకు భూభారతి–2025 చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ కృష్ణానాయక్ తెలిపారు. 3న పేరెపల్లి, వట్టిమర్తి, 4న ఏపూరు, వనిపాకల, 5న పేరెపల్లి, ఉరుమడ్ల, 6న చిన్నకాపర్తి, తాళ్లవెల్లంల, 9న గుండ్రాంపల్లి, ఎలికట్టె, 10న సుంకెనపల్లి, నెరడ, 11న పిట్టంపల్లి, శివనేనిగూడెం, 12న వెల్మినేడు, చిట్యాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**అర్జంటుగా కావలెను**
Part time/full time jobs PMCCS SVE ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. అర్హత:Inter/Degree, Cont:9010925134, 8688689268.

**FINANCE**
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

**WANTED**
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**LOST**
★I, ADIMALLA PARUSHURAM, Resident of 2-177/2, Mupparam, Nidamanoor, Nalgonda, have Lost My Passport, Passport No. M7952031, issued at Hyderabad on 08/04/2015. If found, please Contact: 9902064242.
NT-12141

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **సీనియర్ సివిల్ జడ్జి సబిత**



రామన్నపేట : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సబిత

రామన్నపేట, మే 31 : ప్రజలు పొగాకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సబిత సూచించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు, గుట్కా, పాన్‌మసాలా ఇతర మాదకద్రవ్యాల కారణంగా క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులకు గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మాజిద్, ప్రభుత్వ దవాఖాన వైద్యుడు దేవేందర్, మండల లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం

చౌటుప్పల్, మే 31 : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం నేరమని చౌటుప్పల్ కోర్టు జడ్జి మహంతి వైష్ణవి అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధూమపానం చేసే వారికన్నా చుట్టుపక్కల వారికే ఎక్కువ ప్రమాదమన్నారు. ఇందుకోసం పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. పొగాకులో ఉండే నికోటిన్ పదర్థాం మూలంగా గుండె,శ్వాస, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వస్తాయని ఆమె హెచ్చరించారు. ఈ ఆరోగ్య సమస్యలతో ఆకాల మరణం సంభవించే అవకాశాలుంటాయన్నారు. తద్వారా కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని ఆమె వివరించారు. ఆ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, కోశాధికారి జెల్ల రమేష్, కార్యవర్గ సభ్యులు ఎండీ ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్షులు ఎలమోని శ్రీనివాస్, ఊడుగు శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు తాడూరి పరమేష్, గంగాదేవి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.




చౌటుప్పల్ : సదస్సులో మాట్లాడుతున్న చౌటుప్పల్ కోర్టు జడ్జి మహంతి వైష్ణవి

## ఇంక్రిమెంట్ ఇవ్వాలని నల్లబ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జూనియర్ అధ్యాపకులు

రామగిరి, మే 31: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ అయ్యి ప్రొబేషనరీ పీరియడ్ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం నల్లగొండలోని ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ సెంటర్ కేపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికారుల నుంచి ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు లేనప్పటికీ ప్రిన్సిపాళ్లు రెండో ఇంక్రిమెంట్ చేయకుండా వ్యహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో ఇంక్రిమెంట్లు చేసిన నల్లగొండ ఉమ్మడి జిల్లాలో చేయకపోవడం బాధాకరమన్నారు. రజనీకాంత్, లింగమూర్తి, కృష్ణ, శ్వేత, హరికృష్ణ, విజయభారతి పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

త్రిపురారం, మే 31 : మండలంలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాలలో 1 నుంచి 5వ తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సమన్వయకర్త బలరాంనాయక్, పాఠశాల హెచ్‌ఎం భారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 30, 2వ తరగతిలో 14, 3వ తరగతిలో 6, 4వ తరగతిలో 4, 5వ తరగతిలో 10 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జూన్ 6లోగా దరఖాస్తులతో పాటు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులు అందచేయాలని సూచించారు. ఎంపికలో సొంత మండలం వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. 9న ఉదయం 10గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, తుది జాబితా 10న పాఠశాల నోటీసు బోర్డుపై ఉంచుతామని వివరించారు. పూర్తి వివరాలకు 9491030267 నంబర్‌ను సంప్రదించాలని సూచిం చారు.

## నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

- **ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..**

కట్టంగూర్, మే 31 : ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ప్రారంభానికి నోచక ముందే ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో ప్రజలకు మంచినీటి తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మూడేండ్ల క్రితం మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి పైపులైన్ ఏర్పాటుచేశారు. ట్రయల్‌రన్‌లో భాగంగా ట్యాంక్‌లోకి నీటిని నింపడంతో లీకేజీ వ్యవహారం బయటపడింది. దీంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. అంతేకాకుండా కాలనీలోని గృహాల మధ్య ట్యాంక్ నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ సమస్యను పరిష్కరించి తాగునీటిని అందించాలని కోరుతున్నారు.



ఇందిరమ్మ కాలనీలోని ట్యాంక్

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, మే 31 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల తొలగింపు నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ వేణుగోపాలాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఎన్‌జీకాలేజీ, దేవరకొండరోడ్డు, బీట్‌మార్కెట్, రాక్‌హిల్స్‌కాలనీ, మీర్‌బాగ్‌కాలనీ, శ్రీనగర్‌కాలనీ, మోహన్‌రెడ్డికాలనీ, సూర్యనగర్‌కాలనీ, ఎస్‌ఎల్‌ఎన్‌కాలనీ, సాయిశ్రీకాలనీ, హౌసింగ్‌బోర్డు, రవీంద్రనగర్, ఏకలవ్య స్కూల్, శివాజీనగర్, గాంధీనగర్, ఎన్‌జీకాలనీ, రామగిరి, శివరాం నగర్, సావర్కర్‌నగర్, హైదరాబాద్‌రోడ్డులో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

## వృద్ధుడి ఆత్మహత్య

చౌటుప్పల్, మే 31 : అనారోగ్యానికి గురైన వృద్ధుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చౌటుప్పల్‌లోని గణేశ్‌నగర్‌లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన గుర్జి మైసయ్య(60) కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఉస్మానియా దవాఖానలో చికిత్స చేయించి ఇటీవల ఇంటికి తీసుకొచ్చారు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రభుత్వ దవాఖానకు ఫ్యాక్టర్ల అందజేత

నీలగిరి, మే 31 : జిల్లా కేంద్ర దవాఖానకు ఇంటాస్ ఫౌండేషన్ సహకారంతో హిమోఫీలియా రోగులకు 8 ఫ్యాక్టర్లు, 50 ఇంజెక్షన్ వయల్స్, 30 ఫిజియోథెరపీ కిట్లను దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు ఉడాక్టర్ రజిని, రత్న, స్వప్న, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కీర్తి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సైదులు, సదరం విభాగ అధికారులు రఫీ, ఇజాజ్, ఫౌండేషన్ ప్రతినిధులు కరుణాకర్, శివ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం : తహసీల్దార్

కొండమల్లేపల్లి, మే 31: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని తహసీల్దార్ నరేందర్, ట్రైనీ ఎస్సై చిరంజీవి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీసీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ప్రజలకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పౌర హక్కుల రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హక్కులపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా..హక్కులను కాలరాస్తున్నారా అనే విసయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు తరలిన జర్నలిస్టులు

చిట్యాల, మే 31 : టీయూడబ్ల్యూజే–143 రజతోత్సవ సభకు చిట్యాల నుంచి పలువురు జర్నలిస్టులు తరలివెళ్లారు. తరలినవారిలో సంఘం జిల్లా కార్యదర్శి మూడ వేణు, నియోజకవర్గ అధ్యక్షుడు గిరి, మండలాధ్యక్షుడు కారంపూరి మధు, బాధ్యులు అంతటి శ్రీను, వెంకన్న, బొడిగె విజయ్, జిట్ట నరేశ్, శేఖర్, వెంకటాద్రి, సాయి తదితరులు ఉన్నారు.

## రైతులకు రసీదులివ్వాలి

మిర్యాలగూడ, మే 31: విత్తనాలు, ఎరువుల దుకాణదారులు రైతులకు కొనుగోలు రసీదులను తప్పకుండా ఇవ్వాలని ఇంటర్నల్ స్క్వేర్ టాస్క్ ఫోర్స్ ఆఫీసర్ గిరిప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని కిసాన్ సీడ్స్, రైతుమిత్ర సీడ్స్, పట్టణంలోని విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీలర్లు దుకాణాల్లో ధరల పట్టిక, స్టాక్‌బోర్డు, స్టాక్ రిజిస్టర్లను విధిగా మెయింటెన్ చేయాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ ఉన్నారు.

## అరుణాచలానికి బస్సులు

మిర్యాలగూడ టౌన్, మే 31 : తమిళనాడులోని అరుణాచల గిరిప్రదర్శన కోసం జూన్ 9న సాయంత్రం 5 గంటలకు మిర్యాలగూడ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రతి పౌర్ణమికి భక్తుల రద్దీని బట్టి సర్వీసులు నడుపునున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, 9502502357 సంప్రదించాలని సూచించారు.



నిడమనూరులో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి**
- **ఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి పీహెచ్‌సీ భవనం ప్రారంభం**

నిడమనూరు, మే 31 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి స్పష్టంచేశారు. మండల కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఎంతగానో దోహద పడనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగించినట్లు గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని, అందులో భాగంగా పేదల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. అనంతరం పార్వతీపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, వైద్యాధికారి అరవింద్, పంచాయతీరాజ్ డీఈఈ రామాంజనేయులు, నాయకులు మేరెడ్డి వెంకట్రామహుల్‌రెడ్డి, యడవల్లి వల్లభ్‌రెడ్డి, ముంగి శివమారయ్య, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

త్రిపురారం, మే 31: మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం 80 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కున్‌రెడ్డి విజయకుమారి, ఆర్ఐ గుండెబోయిన సైదులు, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బిట్టు రవికుమార్, భాస్కర్‌నాయక్, బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, అనుముల వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, అంబటి సోమయ్య, కోడిరెక్క రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

## 'గోదావరి-బనకచర్ల'ను నిలిపివేయాలి

- **ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

మునుగోడు, మే 31 : గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శనివారం మండంల కేంద్రంలో జరిగిన సీపీఐ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అండతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు కుట్రలను తెలంగాణలోని అన్ని రాజకీయపక్షాలు తిప్పికొట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజయ్యచారి, మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, దుబ్బాక భాస్కర్, భిక్షంరెడ్డి, రమేశ్, బూడిద సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు


## పంట మార్పిడితో అధిక దిగుబడులు

- **కేవీకే శాస్త్రవేత్త ఆదర్శ్**

మిర్యాలగూడ, మే 31 : రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని కేవీకే, గడ్డిపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు తెలిపారు. శనివారం మండలంలోని జప్తివీరప్పగూడెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన విత్తనాల ఎంపికలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడినిచ్చే విత్తనరకాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామకృష్ణమూర్తి, యామిని, షఫీ, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## కట్టంగూర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్‌రావు

కట్టంగూర్, మే 31: కట్టంగూర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన గుగులోతు ప్రసాద్ హైదరాబాద్ సెక్రటేరియట్‌కు బదిలీపై వెళ్లారు. నార్కట్‌పల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్‌రావు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీటీ ఫ్రాంక్లిన్ రాబర్ట్, ఆర్ఐ కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఇన్‌చార్జి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

## రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

చౌటుప్పల్, మే 31 : చౌటుప్పల్ పీఏసీఎస్‌లో నాణ్యమైన వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సంఘం చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం కార్యాలయంలో సంప్రదించి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ నిలిపివేయాలి

- **పీఆర్‌టీయూ మాజీ కార్యదర్శి నారాయణరెడ్డి**

రామగిరి, మే 31 : ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణను తాత్కాలికంగా నిలిపివేయాలని పీఆర్‌టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి శనివారం ఒక ప్రటకనలో కోరారు. ఓ వైపు బడిబాట, మరోవైపు పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యహరించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి శాస్త్రీయంగా లేదని, 1:20 నిష్పత్తి ప్రకారం హేతుబద్ధీకరణ జరిగితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని తెలిపారు. బడిబాట కార్యక్రమం తర్వాతే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేపట్టాలని సూచించారు.